# కొడుకులకు తగ్గ కోడళ్ళు

-దూరి వెంకటరావు

తన గదిలో అటూ ఇటూ తచ్చాడుతున్న చిన్న కొడుకును చూసి "ఏరా చిర్నూ! నాతో ఏమైనా మాట్లాడాలా?" అడిగాడు నాగభూషణం.

"ఔను నాన్నా!" ఎలాగో మెల్లగా గొంతు పెగుల్చుకున్నాడు చిరంజీవి.

చిన్నప్పటినుంచీ వాడికి తండ్రి దగ్గర ఎంత చనువో అంత భయమూ ఉంది.

"చెప్పు" అన్నాడు నాగభూషణం.

"మహీని, నీరూని వేరే స్కూలో వేద్దామంటోంది సుప్రియ" నసిగాడు.

"ఏ స్కూల్లో?" కోడలి కోరికకు విస్తుపోతూ అడిగాడు నాగభూషణం. చెప్పాడు.

"ఇక్కడైతే ఏమైంది? పిల్లలు బాగానే చదువుతున్నారుకదా. నువ్వు చెప్పిన స్కూల్లో ఫీజులెక్కువని విన్నాను. చదివేది యల్‌కెజి, యుకెజి. ఎక్కడైతేనేం?"

"అది కాదు నాన్నా" మరేదో అనబోయాడు చిరంజీవి.

ఆ మాటతో వాళ్లు ఓ స్థిరమైన నిర్ణయానికి వచ్చేసారని గ్రహించాడు నాగభూషణం. ఇప్పుడు తనేమన్నా వినే స్థితి ఉండకపోవచ్చునను కుని "మీ ఇష్టం. ఎలా బావుంటుందంటే అలా చేయండి" అన్నాడు నిర్లిప్తంగా.

వెళ్లిపోయాడు చిరంజీవి.

సుప్రియ కోరినట్లు వాళ్లని మరో స్కూల్లో వేస్తే సునీత ఊరుకుంటుందా? తోడికోడలు కదా! వాళ్లతోపాటే శేఖర్ పిల్లల్ని కూడా అందులోనే పడేస్తే సరి అనుకున్నాడు.

మాటంటే అన్నాడుగానీ మనసు మాత్రం పీకుతోంది. పిల్లల మీద వేలకు వేలు వెచ్చించడం దండగనిపించింది. ఆ మాట బయటకు అనలేక నోరు నొక్కుకున్నాడు.

నాగభూషణం ఉన్న ఊళ్లోనే సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేసి ఈమధ్యే రిటైరయ్యాడు. శేఖర్, చిరంజీవి రెండు కళ్లు.

సునందకైతే తన పంచప్రాణాల్లో రెండు ప్రాణాలు వాళ్లే. పుట్టిందగ్గరనుంచీ వాళ్లనెంత గారాబంగా పెంచారు. వాళ్లు ఏదడిగితే అది కాదనకుండా కొని పెట్టారు. శక్తికి మించి చదువులు చెప్పించారు.

వాళ్లను విడిచి ఎప్పుడూ ఒక్క క్షణం ఉండలేదు. ఉద్యోగరీత్యా పిల్లలు దూరంగా వెళ్లిపోవలసి వస్తుందేమోనని తెగ దిగులు పడిపోయారు. అలా అని పిల్లలమీద మమకారంతో వాళ్ల భవిష్యత్తుకు అడ్డు పడలేదు. అదృష్టంకొద్దీ ఇద్దరికీ ఉన్న ఊళ్లోనే ఉద్యోగాలవడంతో ఊరట చెందారు.

ఒకటో తేదీన పిల్లలిద్దరూ జీతాలు పట్టుకొచ్చి తండ్రి చేతుల్లో పోస్తారు. తను ఎంత చెబితే అంతే. ఎవరికి ఎప్పుడు ఏది అవసరమో అన్నీ తనే సమకూరుస్తాడు. ఇంటి ఖర్చులకు పోను మిగిలింది బ్యాంకులో వేస్తాడు. శేఖర్‌కు పెళ్లయిన ఆరుమాసాలకే చిరంజీవికి సంబంధం కుదరడంతో వాడి నెత్తిమీద కూడా రెండక్షింతలు చల్లేసాడు. వచ్చినవాళ్లు కొడుకులకు తగ్గ కోడళ్లు అనుకుని మురిసిపోయారు నాగభూషణం దంపతులు. బిడ్డల తల్లులైనా ఇప్పటికీ వాళ్లలానే ఉంటున్నారు. అత్తమామలు ఎంత చెబితే అంత.

శేఖర్‌కి ఇద్దరూ మొగపిల్లలే అయితే, చిరంజీవికి ఒక కొడుకు, కూతురు. తన బిడ్డల్ని ఎంత ప్రేమగా చూసుకునేవాడో వాళ్లని కూడా అంతే ఇదిగా గుండెల్లో పెట్టుకున్నాడు నాగభూషణం. వాళ్లకి నాలుగో ఏడు రాగానే దగ్గర్లోవున్న కాన్వెంట్ స్కూల్లో వేసాడు.

రోజూ తనే పిల్లల్ని స్కూలుకు దిగబెట్టి తీసుకొస్తుంటాడు. దగ్గర కూర్చోబెట్టుకుని హోంవర్క్ చేయిస్తాడు. పడుకునే ముందు కాశీ మజిలీ కథలు చెబుతూ వాళ్లని నిద్ర పుచ్చుతుంది సునంద.

ఇంతవరకూ ఆ కుటుంబ సభ్యుల్లో అరమరికలు లేవు, అపోహలు లేవు. మరెంచేతనో తెలీదు ఈమధ్య సుప్రియ వైఖరిలో తేడా కనిపిస్తోంది. ఇదెక్కడికి దారి తీస్తుందోనని దిగులు పడ్డాడు నాగభూషణం. మొన్న భోగి పండక్కి పిల్లలకు కొత్త డ్రెస్సులు పట్టుకొచ్చి ఎలా ఉన్నాయని అడిగితే 'బావున్నాయి మామయ్యా' అంది సునీత.

సుప్రియ మాత్రం మౌనంగా ఉండిపోయింది. అయినా ఆ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు.

***

మధ్యాహ్నం పన్నెండవుతోంది.

కొడుకులు ఆఫీసులకి, పిల్లలు స్కూళ్లకి వెళ్లిపోయారు. కోడళ్లిద్దరూ కుట్లు నేర్చుకోవడానికి కుట్టు శిక్షణా సంస్థకెళ్లారు.

ఒంటి గంటైతేగానీ తిరిగి రారు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. భోజనానికి కూర్చున్నాడు నాగభూషణం.

"మీకీ విషయం ఎలా చెప్పాలో తెలియడం లేదు'' అంది సునంద చేతిమీద నెయ్యి పోస్తూ.

"చెప్పు ఫర్వాలేదు'' అన్నాడు నాగభూషణం అనునయంగా.

"నిన్న రాత్రి చిరంజీవితో సుప్రియ అన్న మాటలు అనుకోకుండా నా చెవిలో పడ్డా




యండి''

"ఏమంది?'' నోట్లో ముద్ద పెట్టుకుంటూ అడిగాడు.

"మొగుడ్ని ట్రాన్స్‌ఫర్‌కి ప్రయత్నించమంటోంది''


"దానికి మనవాడేమన్నాడు?'' అడిగాడు నాగభూషణం మరింత ఆసక్తిగా.

"చూద్దాం...తొందరపడకు అన్నాడు. నిజంగా వాళ్లు బదిలీ చేయించుకుని వెళ్లిపోతే పిల్లల్ని చూడకుండా నేనుండలేనండి'' అంది సునంద కళ్ల



## నిరాశలో సలోని!

నాలుగైదు చిత్రాల్లో నటించినా కూడా రాని గుర్తింపు 'మర్యాద రామన్న'. హిట్‌తో అందరి దృష్టినీ ఆకర్షించింది ఆ చిత్ర కథానాయిక సలోని. ఈ చిత్ర విజయం తనను టాప్ రేంజ్‌కి తీసుకువెళ్తుందని, అవకాశాలు కోకొల్లలుగా వచ్చి పడతాయని ఆశపడింది. కానీ ఆమె ఆశ అడియాసే అయింది. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే అదే పదివేలని అనుకుందేమో...ప్రస్తుతం 'తెలుగమ్మాయి'లో నటిస్తోంది. ఈ చిత్రమైనా ఆమెను తారాపథానికి తీసుకెళ్తుందేమో వేచి చూద్దాం!




నీరు నింపుకుంటూ.

"నేను మాత్రం ఉండగలనా? అసలు సుప్రియలో వేరు పడాలన్న భావన ఎందుకొచ్చింది? ఇది తనకు పుట్టిన బుద్ధా? లేక ఎవ్వరైనా చెబుతున్నారా? భగవంతుడా! నువ్వే దీనికో పరిష్కారం చూపెట్టాలి'' అంటూ దీనంగా దైవాన్ని వేడుకున్నాడు నాగభూషణం.

"అక్కా, బావ ఏమిటంత దీర్ఘంగా చర్చించుకుంటున్నారు?'' అంటూ వచ్చాడు చైతన్య.

"నువ్వా తమ్ముడూ! రా..కూర్చో. వేళకొచ్చావ్. అన్నం తిందువుగానీ'' అంది సునంద మరో కంచం తెచ్చి వేస్తూ.

"వద్దక్కా. నేను వెంటనే వెళ్లాలి. నీ మరదలు నా కోసం ఎదురు చూస్తూ వుంటుంది. బజారు పనిమీద వచ్చాను. పనిలో పనిగా మిమ్మల్ని చూసి పోదామని వచ్చాను. అది సరే దంపతులిద్దరూ దీర్ఘంగా చర్చిస్తున్నారు దేని గురించి?'' అడిగాడు చైతన్య.

కుటుంబంలో ఈమధ్య జరుగుతున్న పరిణామాలన్నిందినీ పూస గుచ్చినట్లు చెప్పాడు నాగభూషణం.

"చూడు బావా! నేను చెప్పేది మీకు రుచించకపోవచ్చు. అయినా చెప్తున్నాను విను. పిల్లలు పెద్దవాళ్లయిన తరువాత వాళ్ల ఇష్టాఇష్టాలకు వదిలివేయాలేతప్ప కొనదాకా పట్టుకుని వ్రేలాడకూడదు. చిరంజీవి, శేఖర్‌కంటే ఎక్కువ సంపాదిస్తున్నాడు. అటువంటప్పుడు సుప్రియ వాళ్లకంటే ఉన్నతంగా ఉండాలనుకోవడంలో తప్పేముంది?''

చైతన్య మాటలకు నొచ్చుకుంటూ "అదేంటి బావా అలా అంటావ్? వాళ్లు తెచ్చిన డబ్బు నేను ఆదా చేస్తున్నానే తప్ప పాడు చేయడంలేదు. నా తదనంతరం ఆస్తి అంతా వాళ్లే కదా చెరి సగం పంచుకునేది. ఇప్పటినుంచే ఎందుకీ భేధభావమో బోధపడడంలేదు'' నాగభూషణం గొంతులో ఆవేదన ధ్వనిస్తోంది.

"అక్కడే నువ్వు పప్పులో కాలేసావు. పొదుపు చేసిన సొమ్ము ఇరువురిది అయినప్పుడు చిరంజీవి ఎక్కువ సంపాదించి పెట్టడంవల్ల వాడికొరిగే లాభమేమిటి? ఇవన్నీ ఎందుగ్గానీ నా మాట విని వాళ్లు ఎక్కడికి వెళ్లాలనుకుంటే అక్కడకు వెళ్లని. అలాగే శేఖర్ని కూడా పట్టుక్కూర్చోకు. నీకొచ్చే పెన్షన్ మీ ఇద్దరికీ సరిపోకపోదు. ఒంట్లో ఆరోగ్యంగా ఉన్నంతవరకు మీరు హాయిగా ఉండండి. అవసాన దశలో మనకు ఎలాగూ వృద్ధాశ్రమాలు ఉండనే ఉన్నాయి'' అన్నాడు చైతన్య.

చైతన్య మాటలకు నాగభూషణం దంపతులు మరింతగా కృంగిపోయారు. కాసేపు ఆ మాటా ఈ మాటా అయ్యాక వెళ్లిపోయాడు చైతన్య.

వచ్చినవాడు పిల్లలకి నచ్చచెప్పి వాళ్ల మనసు మారుస్తాడేమో అనుకుంటే ఇలా మాట్లాడతాడేంటి? ఇందులో వాడిననుకోవడానికి లేదు. పుండు తనదైతే బాధ వాడికెందుకుంటుంది? అనుకున్నాడు లోలోపల.

చిన్నకొడుకు తనను విడిచి పెట్టి వెళ్లిపోతాడేమోనన్న దిగులు నాగభూషణాన్ని నిద్రపట్టనివ్వడంలేదు. ఇంచుమించు సునంద పరిస్థితి అంతే. మింగలేక, కక్కలేక లోలోపలే మధన పడుతోంది.

***

ఇలా ఉండగా ప్రశాంతతకోసం ఓ రోజు సాయంత్రం శంకరమఠానికి వెళ్లాడు నాగభూషణం. అక్కడెవరో స్వామీజీ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తుంటే వింటూ కూర్చున్నాడు. ఆ ప్రసంగ కార్యక్రమం పూర్తయ్యేసరికి రాత్రి దాదాపుగా ఎనిమిదయింది.

"రేయ్! ఎప్పుడూ లేనిది నువ్వేంట్రా ఇవాళ మఠానికొచ్చావ్?'' పలక

రించాడు జోగారావు నాగభూషణాన్ని చూసి విస్తుపోతూ.

వాళ్లిరువురూ చిన్ననాటి స్నేహితులు. మఠంలో కలుసుకోవడం ఇదే ప్రథమం.

"మనసుకు కాస్త ప్రశాంతంగా ఉంటుందని వచ్చాను" చెప్పాడు నాగభూషణం.

అతడి మాటల్లో ఇదివరకటి హుషారు లేకపోవడం గమనించి "అంత డీలా పడిపోతావేమిత్రా? నీకొచ్చిన కష్టమేంటి? కొడుకులిద్దరూ బాగానే సంపాదిస్తున్నారుకదా. రాజాలా ఉండడం మానేసి ఇంత నైరాశ్యం దేనికి?" అడిగాడు జోగారావు.

"చెప్తాను. అలా కాసేపు అరుగుమీద కూర్చుందాంరా" అన్నాడు నాగభూషణం.

ఇరువురూ మఠానికి కాస్త దూరంగా వున్న అరుగుమీద చతికిలబడ్డారు.మనసులో బాధనంతా మిత్రుడి ముందు వెళ్లగ్రక్కాడు నాగభూషణం. తనకిప్పుడు కావాల్సింది సమస్యకి పరిష్కారం. అది ఏ ఒక్కరైనా సూచించకపోతారా అనుకుని తారసపడ్డ ఆప్తులందరితో తన గోడు వెళ్లబోసుకుంటున్నాడు.

"దీనికి నేనో చిట్కా చెబుతాను. ముందు అడిగిందానికి సూటిగా సమాధానం చెప్పు. మీ కుటుంబ సభ్యులంతా నీపట్ల ప్రేమగా ఉంటారా?" అడిగాడు జోగారావు.

"మా అబ్బాయిలకి నేనంటే ప్రాణం. అందులో అణువంతైనా సందేహపడనక్కర్లేదు. ఇక కోడళ్లంటావా కొడుకులకు తగ్గట్టే ఉంటారు. అయితే చెప్పానుకదా ఎందుకో ఈమధ్య మా చిన్న కోడలి ధోరణిలో రవ్వంత మార్పు కనబడుతోంది"

"చూడు నాగూ! మానవ సంబంధాలన్నీ ఇప్పుడు డబ్బుతోనే ముడిపడి ఉన్నాయి. ఆ ముడిని జాగ్రత్తగా విప్పగలిగితే ఫర్వాలేదు. లేకపోతే అవి బెడిసికొట్టే ప్రమాదముంది. అందుచేత నేనో మాట చెబుతాను అలా చేయి" అంటూ చెవి కొరికాడు జోగారావు.

"థాంక్సరా. ఇది ఎలా వర్కవుట్ అవుతుందో చూద్దాం" అన్నాడు నాగభూషణం మిత్రుడికి కృతజ్ఞతలు తెలుపుతూ.

***

"పిల్లల్ని మళ్లీ అటు ఇటు తిప్పడం ఎందుకు? ఉన్న స్కూల్లోనే వుంచేద్దామంటోంది సుప్రియ" అన్నాడు చిరంజీవి తండ్రి దగ్గరకొచ్చి.

"నువ్వేదో బదిలీకి ప్రయత్నిస్తున్నావని విన్నాను. ఎక్కడికేంటి?" తమ్ముడ్ని అడిగాడు శేఖర్.

"బదిలీలేదు పాడులేదు. ఆ ప్రపోజల్ ఎప్పుడో క్యాన్సిల్ చేసుకున్నాను" అన్నాడు చిరంజీవి.

ఆ మాటతో 'హమ్మయ్య' అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నాడు నాగభూషణం.తను వింటున్నది కలో నిజమో తెలీడంలేదు సునందకి.

***

భర్త ఒంటరిగా ఉన్నప్పుడు చూసి-

"ఏం మంత్రం వేసారండీ...ఉన్నఫళంగా చిన్నవాడిలో ఇంత మార్పొచ్చింది?" అని అడిగింది.


"జోగయ్య మంత్రం" అన్నాడు నాగభూషణం తాపీమని.

"జోగయ్య మంత్రమా? అదేం మంత్రమండీ?" విస్తుపోతూ అడిగింది సునంద.

"ఈ నెల నుంచి పిల్లలు పట్టుకొచ్చిన జీతాల్ని నాకివ్వొద్దన్నాను. ఎవరి డబ్బు వారి పేరనే బ్యాంకులో వేసుకోమన్నాను. ఇంటి ఖర్చులకు మాత్రం చెరో ఆరువేలిస్తే చాలన్నాను. అంతే...సీను మారిపోయింది. ఈ చిట్కా చెప్పింది ఎవరనుకున్నావు? నా బాల్య మిత్రుడు జోగారావు. అందుకే అన్నాను జోగయ్య ఘంత్రం అని" అన్నాడు నాగభూషణం నవ్వుతూ.

అతడి నవ్వులో శృతి కలిపింది సునంద.

★



## కంప్యూటర్ మాయాజాలం!

సన్నగా ఉండే ఎడ్డీ మర్ఫీ 'ది నట్టీ ప్రొఫెసర్'లో నటించి ప్రపంచవ్యాప్తంగా అనేకమందిని మెప్పించాడు. అయితే మళ్లీ అదే సినిమాని సీక్వెల్ తీసి ఎడ్డీ మర్ఫీని లావుగా ఉన్నట్లు చూపించాలంటే అతను కష్టపడి ఒళ్లు పెంచుకోనక్కర్లేదుట. కంప్యూటర్ సహాయంతో సన్నగా ఉండే మర్ఫీని లావుగా మార్చి చూపించవచ్చునట.

